

కొలప్ప శివశేఖర్

వీరాస్వామి ఆ కటిక చీకట్లో నడుస్తున్నాడు.

వీరాస్వామికి ఆ దారి బాగా అలవాటు. ఏ పొదలో ఏ పురుగులున్నాయో ఏ పుట్టలో ఏ పాములున్నాయో బాగా తెలుసు. అందుకే అంత ధైర్యంగా ఊరివేపు నడుస్తున్నాడు. ఆరు నెలలు జైలు జీవితాన్ననుభవించాడు ఉదయమే విడుదలయ్యాడు. ఏ మధ్యాహ్నమో ఊరు చేరవలసింది. కానీ అవమానించిన ఊళ్ళో అడుగుపెట్టడానికి మొహంచెల్లక ఈ చీకటి చాటున బయల్దేరాడు.

అతని కాళ్ళు ఊరివేపు నడుస్తున్నా అతని ఆలోచనలు గౌరమ్మ మీదే ఉన్నాయి.

వీరాస్వామి ఆమెను ప్రేమించినంతగా కన్నవాళ్ళనుకూడా ప్రేమించి ఉండడు. గౌరమ్మ అంటే అతని ప్రాణం. ఆరు నెలల జైలు జీవితంలో తనగోడు జైల్లు గోడలకు విన్పించి గౌరమ్మకోసం విలపించాడు.

చిన్నప్పట్నుంచీ, ఒకే ఊరులో పుట్టి కలిసి మెలిసి తిరిగారు. ఆమెను పెళ్ళి చేసుకొని సుఖపెట్టాలనుకున్నాడు పెళ్ళి చేసుకున్నాడు. కాని - సుఖపెట్టలేక పోయాడు.

చాలీచాలని జీతంతో పెదకామందు దగ్గర పాలేరుగా బ్రతుకు వెళ్ళబుచ్చాడు, అంతకంటే మంచి బ్రతుకు కోసం ఆశించాడు. ఎవరికోసం - గౌరమ్మకోసం. తన బ్రతుకు ఇలా జైలుపాలవుతుందని అతను ఏనాడూ అనుకోలేదు. నేరస్థుడిగా యిక ఊళ్ళో తనకు స్థానం లేనట్టే! ఇంతకీ తను చేసిన నేరం? పెదకామందు గారి అబ్బాయి సూరిబాబును కొట్టాడు. పొలం గట్టున గౌరమ్మ చేయి పట్టుకున్నందుకు - అంతేకాదు రాత్రికి తోటలోకి కూడా రమ్మన్నాడుట! ఈ విషయం గౌరి వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ తనకు చెబుతుంటే కోపం పట్టలేక ఆవేశంతో పెదకామందు యింటికి వెళ్ళాడు.

సూరిబాబు శరీరం నెత్తురుతో ఎర్రబడి పోయింది. పెదకామందు కళ్ళు కోపంతో ఎర్రబడిపోయాయి. ఊరిజనం గుర్రుగా చూశారు. ఆ చూపులు సూరిబాబుమీద చేయిచేసుకొనే వీరుడా ఈ వీరిగాడన్నట్లున్నాయి.

"అతన్ని ఎందుకు కొట్టావ్ - దేనికి" అని ఏ ఒక్కరూ తనని అడగలేదు సరికదా ఎవరికి వారే మెల్లిగా జారుకున్నారు. తను మాత్రం జరిగిందేమిటో పెదకామందుకు చెప్పాడు.

ఇన్నేళ్ళలో తన మంచితనం ఏపాటిదో పెదకామందుకు బాగా తెలుసనుకున్నాడు కానీ జరిగిందేమిటి?

సూరిబాబు హాస్పటల్లో - తను జైలులో.

తను జైలు కెళ్ళిన రోజున గౌరి ఎంతగా ఎంతగా ఏడ్చిందని - తను లేకపోతే చచ్చిపోతానంది. ఆమె కూడా ఏదో ఒక నేరం చేసేసి తనతో జైలుకి వచ్చేస్తానంది. ఆమెని ఓదార్చడం తనతరంకాదు. కన్నీళ్ళు కార్చుకుంటూ గుండెను రాయి చేసుకొని తను రాతిగోడల మధ్యకు వెళ్ళిపోయాడు.

సూరిబాబు మళ్ళీ గౌరమ్మ జోలికిరాడు. ఒక్క గౌరమ్మే కాదు, ఊళ్ళో మరే ఆడపిల్ల వెంటాపడడు. తను కొట్టిన

దెబ్బలకు అతనింకా బ్రతికే ఉండడం ఆశ్చర్యంగానే ఉంది. పాపాత్ములను త్వరగా చావు రాదంటారు. ఇదేనేమో! వాడు చావకుండా ఉండడమే మంచి దయింది! వాడు చనిపోతే, తనకు ఉరి శిక్ష పడి ఉండేది.
తను చనిపోతే గౌరమ్మ ఏమౌతుంది? దానికి యిక దిక్కెవరు? ఒక్కరోజు ఎడబాటునే ఆమె భరించలేదు - యిక జీవితంలో శాశ్వతమైన దూరాన్ని ఎలా సహించగలదు. తనే లేని నాడు ఆమె ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుంది, అది తప్పదు ఆమెకు తనంటే ప్రాణంతో సమానం. తన వంటిమీద ఏ చిన్న గాయమైనా ఆమె విలవిల్లాడి పోతుంది. జైలులో వుండగా రెండుసార్లు చూడ్డానికి వచ్చింది. మనిషి దిగులుతో బక్కచిక్కి సగమై పోయింది. ఆమె మొహంలో చిరునవ్వు మాయమై శోకదేవతలా కనిపించింది.
మాటల సందర్భంలో సూరిబాబు ప్రసక్తి వచ్చింది. వాడు గౌరమ్మవేపు కన్నెత్తి చూడడంలేదుట-అసలు తమ గుడిసె ఛాయలకే రావడం లేదట-బుద్ధొచ్చుంటుంది వెధవకి.
ఊరు దగ్గర పడింది. వీధి దీపాలు మరింత స్పష్టంగా కన్పిస్తున్నాయి వీరాస్వామి వేగంగా, వుత్సాహంతో నడుస్తున్నాడు. అతని మనసంతా గౌరమ్మ మీదే వుంది. ఆరునెలలు ఆరు యుగాలుగా గడిచాయి. రోజులు లెక్కపెట్టుకుంటూ, ఆవేదనతో గడిపేశాడు. జైలు వాళ్ళు వారం రోజులు ముందుగానే అతన్ని విడుదల చేశారు.
బయటకొచ్చాక ఆనందం పట్టలేక పోయాడు వీరాస్వామి. పిచ్చిగా రోడ్ల మీద పరిగెత్తాలనిపించింది - గంతులు వేయాలనిపించింది-జానపదాలు పాడాలనిపించింది-అవన్నీ చేస్తే పిచ్చెక్కిందని పిచ్చాసుపత్రికి మోసుకుపోతారని భయం వేసి అంత ఆనందాన్నీ గుండెల్లోనే దాచేసుకున్నాడు.
రెక్కలు కట్టుకొని గౌరమ్మముందు వాలాలన్పించింది. కాని, పగలు వూళ్ళోకెళ్ళాలన్పించలేదు. అందరూ తనని వింతగా, అసహ్యంగాచూస్తారన్పించింది. అందుకే ఈ అర్థరాత్రి వేళ వూళ్ళోకి బయల్దేరాడు.
కొన్ని నిముషాలు అనంతరం- వూళ్ళోకి అడుగు పెట్టాడు వీరాస్వామి. ఊరంతా నిద్రపోతోంది. అలికిడిలేదు — అంతా నిశ్శబ్దం-!
మట్టి రోడ్డుమీద అడ్డంగా రెండు కుక్కలు పొర్లాడుతున్నాయ్. అతన్ని చూసి అవి అరవడం మొదలెట్టాయ్. వాటి అరుపులు విన్పించుకోలేదతను.
ఎందుకో వూరు కొత్తగా వున్నట్లుంది. ఆరునెలలకే ఏవో మార్పులు గోచరిస్తున్నాయ్. గౌరి ఏం చేస్తుంటుంది-?
ఇలా హఠాత్తుగా తను రావడం ఆమెకు ఆశ్చర్యంగానే వుంటుంది. ఆనందపడి పోతుంది. తననుకౌగలించుకొని పిచ్చిగా ముద్దులు పెట్టేస్తుంది వెర్రిపిల్ల! త్వరగా యింటికి చేరుకోవాలి. వేగంగా నడుస్తున్నాడు వీరాస్వామి.
రావిచెట్టు చప్టామీద ఎవరో దగ్గుతున్నారు. అటు చూశాడు. ఎవరో

ముసలివాడు వణికిపోతూ ముడుచుకుని, పడుకొని కనిపించాడు.

పాపం! ఒంటిమీద చొక్కా అయినా లేనట్టుందే, యిక్కడెందుకు పడుకున్నాడు-? ఇల్లులేదా-ఎవరైవుంటారు-? ఈ వూళ్ళో తనకి తెలియని వాళ్ళంటూ ఎవరూ లేరే...!

వీరాస్వామి రావిచెట్టు వేపు నడిచాడు, ముసలివాడు ఇంకా దగ్గుతూనే వున్నాడు. వీరాస్వామి వంగి అతని మొహంలోకి చూశాడు.

స్తంభించిపోయాడు- ఆపై ఆశ్చర్యపోయాడు తన కన్నతండ్రే. ఈ చలిలో...ఈ రాత్రివేళ...ఈ రావిచెట్టు కింద ఎందుకున్నట్టు-?

"అయ్యా... అయ్యా..." పిలిచాడు. అతను చిన్నగా కదిలాడు.

కళ్ళు తెరిచిచూశాడు. వీధిలైటు కాంతిలో తనమీదకు వంగిన ఆకారాన్ని పోల్చుకొని గభాల్న లేచికూర్చున్నాడు.

"నీవు....నేవేనేంట్రా వీరిగా..." గొల్లుమన్నాడతను

"నేనేనయ్యా...ఏంది....యీడతొంగున్నావ్?"

"నువ్వు జయిలుకు యెల్లినకాన్నించీ యిదేరా నా యిల్లు."

"అదేం మనిల్లుందిగా."

"ఆఁ ... ఇల్లువుంది ... ఇంట్లో నీ పెళ్ళామూ వుంది."

"ఏందయ్యా నువ్వనేది!"

"ఉరేయ్! వీరిగా నీ పెళ్ళాం రంపలాడిరా."

"నా పెళ్ళాం...నా గౌరి...ఏమన్నావ్"

"సెపుతారా...నిన్ను జయిలుకి పంపించి


హలో హలో హలో

మీ ప్రమోషన్ ఆగిపోయిందా ?

మీ బాస్ మీమీద కారాలు మిరియాలూ నూరుతున్నాడా?

మీ క్లాస్ మేట్ అనితా, సునీతా ఇద్దరిలో ఏ ఒక్కరూ మిమ్మల్ని ప్రేమించటం లేదా?

ఏం ఫరవాలేదు సార్! డోంట్ వర్రీ! వెంటనే **హ్యూమరాలజీ** కథల సంపుటి కొని బహుమతిగా యిచ్చేయండి! తెగ సక్సెస్ అయిపోతారు.

ఇదిగో-ఇక్కడె **హ్యూమరాలజీ** పుస్తకాలు దొరుకుతాయి

వెంటనే వ్రాయండి.

**నవసాహితీ బుక్ హౌస్, ఏలూర్ రోడ్**

**విజయవాడ-2**

నీ పెళ్ళావేరా...నీ పెళ్ళికంటె ముందు నించి—దానికీ సూరిబాబుకీ సమ్మందం వుందిరా....ఆళ్ళ బాగోతానికి మద్దెలో నీవడ్డున్నావ్...నిన్ను అడ్డు తప్పించాలని ముందుగానే ఆలోసించుకొని సూరిబాబుమీద యేవో కంబిసాకులు సెప్పిందిరా...నీవు ఆవేశంగా ఆణ్ణి కొట్టేసినవ్ ... జయిలుకి ఎళ్ళిపోయినవ్... జనంలో నీవు నేరగాడివై పోయినవ్... సూరిగాడు పెద్దమడిసైపోయిండు...నీ పెళ్ళాం పతివ్రతై పోయింది ...''

వీరస్వామి గుండెలు పగిలిపోయాయ్.

ఎంత నాటకం ఆడింది!

దాన్ని...దాన్ని చంపేయాలి...దానితో పాటు ఆసూరిగాణ్ణి కూడా పొడిచెయ్యాలి.

"గౌరి యిపుడు యాడుంది?"

"ఇంకేడవుంటుంది...మనింట్లోనే... ఆ సూరిగాడు కూడా వుండే వుంటాడు... వూరంతా పద్దయ్యాక గుడిసెలోదూర్తాడు ...ఏ తెల్లారో గుడి సొరబడ్తాడు...''

వీరాస్వామి యిక వినలేక పోయాడు. ఆవేశంతో గుడిసెవేపు కదిలాడు.

"ఒరేయ్ కొడకోయ్...." వెనుక నుంచి ముసలాడు అరుస్తున్నాడు.

వినిపించుకోలేదు...ఆగలేదు — నడుస్తున్నాడు వేగంగా. కొద్దినిమిషాల్లో గుడిసె ముందునిలబడ్డాడు తలుపుదగ్గరకువచ్చాడు లోపల్నుంచి చిన్నగా నవ్వులు — నిట్టూర్పులు...తలుపు కంతలోంచి చూశాడు. సడ్డిగా వెలుగుతున్నలాంతరువెలుగులో ఆ దృశ్యం. చూడలేకపోయాడు. చూరిమీద గడ్డితొ సేకొడవలి చీకట్లో అస్పష్టంగాకనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఓ నిముషం ఆగి - గుండెలు నిండుగా వూపిరి పీల్చుకొని, కాలితో తలుపును బలంగా తన్నాడు-తలుపు పెద్దగా శబ్దం చేస్తూ తెరుచుకుంది.

మంచంమీద గౌరి—సూరిబాబు, అదిరిపడి చూశారు' వాళ్ళ గుండెలు ఆగిపోయాయి వీరాస్వామి లోనికి నడిచాడు. ఆమె వణికి పోతోంది భయంతో-చెమటలు కారిపోతున్నాయ్, గభాల్న దుప్పటిని మీదకు లాక్కొని మంచం దిగింది గౌరి.

తన గౌరి!! తను విపరీతంగా ప్రేమించిన గౌరి-తన కళ్ళ ముందు-యిలా...

వీరాస్వామి కొడవలి యెత్తి ఆమె వేపు నడిచాడు. గౌరి కళ్ళలో ప్రాణభీతి స్పష్టంగా అగుపిస్తోంది.

ఆమె మెడ మీద కొడవలి ఆనించాడు.

"వద్దు...వద్దు..." ఆమె చిన్న గా అంటోంది—ఏడుస్తోంది.

సూరిబాబు ఆ అవకాశాన్ని వినియోగించుకొని లుంగీ చుట్టబెట్టుకుంటూ బయటకు పరుగుతీశాడు.

తను తాళికట్టిన గౌరి !!! ఆమె మెడలో మెరుస్తున్న తాళి-దాన్ని అపవిత్రం చేసేసింది. తను కట్టిన తాళికి విలువ లేదు. వీరాస్వామి ఆమె మెడ మీద కొడవలిని మరింతగా నొక్కి పెట్టాడు. ఆమె భయంతో వొక్క గావుకేక వేసింది. ఆమె మెడలో మెరుస్తున్న తాళిని కొడవలితో తెంపేశాడు వీరాస్వామి. తాళి వేపొక్క క్షణం చూసి, దాన్ని జేబులో వేసుకున్నాడు.

కొడవల్ని వారవిడిచేశాడు. బయటకు నడిచి ముందుకు కదిలిపోయాడు.

చీకట్లో అతని ఆకారం అదృశ్యమై పోతోంది.